కథ

# శవం తిన్న మనుషులు

- బమ్మిడి జగదీశ్వరావు.



చచ్చిన కాకి చుట్టూ పదికాకులు చేరాయి !

చచ్చిన చీమ చుట్టూ వందలాది చీమలు చేరాయి !

చచ్చిన మనిషి చుట్టూ కాదు కదా. దరిదాపులకి ఒక్క మనిషీ చేరలేదు!!

ఆ శవం రోడ్డు ప్రక్క పొలంలో పడివుంది. శవం శవంలా లేదు. ఆదమరచి నిద్ర పోతున్నట్టుగా వుంది. కూలిపోయిన మర్రి మానులా వుంది. గాలికి కూడా కదలని గెడకర్రలా బిగుసుకుపోయివుంది.

దారిన పోయే వాళ్ళంతా ముక్కులు మూసుకుంటున్నారు - ఆ కుళ్ళిన కంపు భరించలేనట్లు ! కళ్లు మూసుకుంటున్నారు - ఆదృశ్యం చూడలేనట్లు ! చూపు మరల్చుతున్నారు - వంట్లో తిప్పుతున్నట్లు !

ఓ కుక్కేమో చెయ్యో, కాలో తెలీదుగానీ శవాన్ని పట్టి పీకుతోంది. మరో కుక్క మోరెత్తి 'వో‹..వ్'.. అంటూ అరుస్తోంది. కాకులు 'కావ్‌కావ్' మంటూ నేలమీద వాలకుండా ఎగురుతున్నాయి. ఆ అరుపులు శవం లేచినచోట మోగిన చావు మేళం లాలేదు, రాబందుల్ని రమ్మన్న రాగతాళంలా వుంది !

ఊర్లోకి పోవలసిన కాళ్ళు రెండు క్షణాలు అలానే నిలబడి పోయి, అటు తర్వాత పొలంలోకి దిగబడ్డాయి. గుండె కొట్టుకోవడం వేగమయింది. రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. మరింత దగ్గరికి వెళ్ళాను.

మొల మీద తప్ప ఏ ఆఛ్ఛాదనా లేని ఆ శవాన్ని చూసాను!

అది .... గుఱ్ఱాల సాంబయ్య శవం .... జట్కా సాంబయ్య శవం ...... ! !

వంట్లోని నాడులన్నీ ఒకేసారి స్తంభించి పోయినట్లయింది.

నానోటి నుంచి మాట కూడా రాలేదు. కుక్కలు భయంతో దూరంగా జరిగాయి. కాకులు దూరంగా చేరి అరుస్తూనే వున్నాయి. సాంబయ్యని కళ్ళతోనే తలనుంచి కాలిదాక



తడిమాను ..... కాలు ... కాలు కుడికాలు మొండిగా వుంది. పాదం లేదు ... నల్లని రక్తపు ముద్దల ముక్కలు ...

దూరంగా రెండు కుక్కలు రెండు వైపులకు లాగుతూ పెనుగులాడుతున్నాయి.

పొద్దు గూకుతున్నందున వాటి పళ్ళ మధ్య పడినదేదో సరిగ్గా అవుపడ్డం లేదు.

అప్రయత్నంగా కుక్కల దగ్గరకు పరిగెత్తాను. అవి నన్ను చూస్తూనే నోట్లోది జారనివ్వకుండా పరిగెత్తాయి. పొలాల వెంబడి



తరిమి తరిమి అలసిపోయి కోపంగా మట్టిబెడ్డ తీసి పిచ్చిగా విసిరాను. కొంచెం సేపు నిలబడి, తిరిగి శవం దగ్గరకు వచ్చాను.

అప్పటికే బాగా చీకటి పడింది.

రోడ్డు మీద నుంచి ఎవరో ఇద్దరు చీకటి పడింది, శవం దగ్గరేమిటని ? హెచ్చరిస్తూ పిలుస్తున్నారు.

చీకటికి కాకులూ లేవు.చింతగిర్లూ లేవు. భరించలేని నిశ్శబ్దం చెవుల్ని బద్దలు కొడుతోంది. భయం వేసింది, అసహ్యం వేసింది జీవితమ్మీద!

అక్కడ మరి నిలబడలేక పోయాను. రోడ్డెక్కాను.

నన్ను చూస్తూనే "నువ్వట్రా మూర్తి .... ఎప్పుడు ఊర్నుంచి రావడం ? ఇంత సీకటేల్లో ఏట్ర నవ్వు సేసిన పని ?" పాలుపోసిన పకీర్రాముడు నన్ను చనువుగా మందలించాడు

"గుఱ్ఱాల సాంబయ్య ...." అంతకు మించి మాటరాలేదు నా నోటికి.

"అడికి బూమ్మీద నూకలు సరి, ఎలిపోండు" పకీర్రాముడు పక్కనున్న మరో ఆసామి వేదాంత ధోరణిలో పెదవి విరిచాడు.

".... అదికాదు, సాంబయ్య ఎలా చచ్చిపోయాడు ... ఎప్పుడు ?...." నా పెదవులు వణుకుతున్నాయి.

నడుస్తూనే పకీర్రాముడు చెప్పాడు.

గుఱ్ఱాల సాంబయ్య గూటాంలా వున్నా, వాడి కాలే వాడి ప్రాణం తీసిందట. వాడి కుడి పాదాన్ని గుఱ్ఱమే కుమ్మిందో.. మరి జట్కా వుండే తిరిగిందోలేకపోతే దబ్బనంలాంటి మేకే దిగిందో గాని మొత్తానికి కాలుకి దెబ్బతగిలింది. గాయమయి పోయింది. శ్రద్ధే చూపలేదో ....డబ్బుల్లేక అశ్రద్ధే అయిందో గాని పుండు పగిలి చీము కాలం .. రక్తం కారి ... నరాల్లోకి చేరి ... పాదం పాదమే పెద్ద పళ్ళగాట్లతో కొరికినట్లు ముక్కలు ముక్కలు రాలి కాలు కదపడం కష్టమయిపోయింది. దాంతో కడుపుకి కష్టమయి పోయింది. ఆకలి పేగుల్ని పొగెట్టి పుటుక్కున తెంపేసింది.

సాంబయ్య గురించి ఏదో అడగాలనుకున్నాను ... అడగబోయే సరికే పకీర్రాముడు, వాడి జట్టుగాడు ఇద్దరూ వస్తాం అని సందు మలుపు తిరిగారు.

ఇంటికి చేరాను.

అమ్మా ! అక్కా నా బేగు తీసుకొని క్షేమ సమాచారాలేవేవో అడుగుతున్నారు. వాళ్ళకి సమాధానం ఇవ్వకుండానే అన్నాను.

"గుఱ్ఱాల సాంబయ్య చచ్చి పోయాడు"

శవం దగ్గరకు వెళ్ళావా?" అమ్మ అనుమానంగా అడిగింది.

నా నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "శవం దగ్గరకి వెళ్ళినవాడివి, స్నానం చెయ్యకుండా ఇంట్లోకి వచ్చేసావా?" అమ్మే మళ్ళీ అనేసి, గబగబా పసుపు నీళ్ళు కలిపి నా తలమీద చల్లి మిగతా నీళ్ళతో కాళ్ళు కడుక్కోమంది.

ఆ పని చేస్తే గాని సమాధానం రాదు గనుక, కాళ్ళు కడుక్కొని అమ్మని అడిగాను. చెప్పింది.

సాంబయ్య కాలు బాధతో జట్కా నెలరోజుల్నుంచి వేయలేదట. ఒక పూటో, ఒక రోజో అయితే ఎవరో ఒకరు పిడికెడన్నం పెట్టేవారట. నెలరోజులు పెట్టే స్తోమత ఎవరికీ లేదట. దానికి తోడు కుళ్ళిపోయిన కాలుచుట్టూ ఈగలు ఝుమ్మనేవట. కుళ్ళిపోయిన కాలు పితపితలాడి ఆమడ దూరం వరకూ కంపు వచ్చేదట. అది చూస్తే ఎవరికైనా వంట్లో తిప్పేదట.జాలివేసినాజబ్బులొస్తాయని ఎవ్వరూ దరికి చేరలేదట ... పాక్కుంటూ వచ్చినా చేరనివ్వలేదట. కాలం మించి పోయిందట. మరి ఫలితం లేదట. అందుకే వదిలేసారట. వదిలి వుండలేక పోయేరట. వాడి కుళ్ళుకంపుని భరించలేక తిట్టారట. అప్పుడే దేక్కుంటూ వూరు దాటాడట. వూరు దాటగానే ప్రాణం పోయిందట.

ఆరాత్రి అమ్మ చెప్పిన విషయాలు నన్ను నిద్దురపోనివ్వకుండా చేసాయి. గుఱ్ఱాల సాంబయ్య చచ్చిపోవడం నిజం కాదనిపిస్తోంది. ఇంకా బతికి వున్నట్టుగానే తోస్తోంది. జట్కాబండి తోలుతూ, పాట పాడుతున్నట్టుగానే కళ్ళముందు నవ్వుతున్న సాంబయ్య ముఖం మెదుల్తోంది.

కొత్తూరు జంక్షను నుండి నివగాం, ముక్కిడి పోలమ్మగుడి, మెట్టూరు, పెద్దదిమిలి గనసరా, కుంటిభద్ర, కల్లెమ్మ...... ఊర్లన్నింటినీ కలిపే రహదారి గుఱ్ఱాల సాంబయ్య జట్కా, ధూళి రేపుకుంటూ గాలిలా వెళ్ళే జట్కా, వేళాపాలాలేని జట్కా, బతికివున్న మనుషుల్నే కాదు, శవాల్ని కూడా సమానంగా మోసిన జట్కా ... ఎంత భారాన్నీ జీవితంలా మోసుకు పరిగెత్తే గుఱ్ఱం ... అలుపు సలుపూ లేని అందమైన గుఱ్ఱం .. మా ఊరి పిల్లలందరికీ నచ్చిన గుఱ్ఱం ... అందరి మనిషీ అయిపోయిన గుఱ్ఱాల సాంబయ్య ... టికెట్టు అడక్కుండా, టీకి డబ్బులిచ్చినా సరే అన్నం పెట్టినంత ఆనందపడిపోయిన సాంబయ్య .. బస్సుల బందులకీ ... బలిసినోళ్ళ విందులకీ మాత్రమే గుర్తొచ్చే సాంబయ్య ...

సాంబయ్య నిన్న చనిపోయేడట. రేపటికి మూడ్రోజులు ... సాంబయ్యని ఇంకా మట్టిలో ఎందుకు కలిపెయ్యలేదు ? కుక్క చస్తే (కంపు అని) ఈడిచేస్తారేం? మరి మనిషి ....? ... సాంబయ్య చనస్తానే ఊరుదాటాడు ... ఆచావు ఆటంకం కాలేదేమోమరి.. ఆ కుళ్ళు కంపు ఊర్లోలేదనేమో మరి ?!

ఊరు కొత్తూరయినా పాతూరే !....

ఊరు పెద్దదైంది. తామర చెఱువును ఆనుకొని ఒకవేపు నేతాజీనగర్ వెలిసింది. మరోవేపు కాష్టం వుంది. అయితే నేతాజీనగర్ పెరిగినంతంగా, ఊరు పెరిగినంతగా కాష్టం పెరగలేదు!

ఇప్పుడు అక్కడినుంచి నక్కల వూళలు వినిపిస్తున్నట్టున్నాయి.

ఆవూళ వినిపించినప్పుడల్లా గుండె ఝుల్లు మంటోంది. గుఱ్ఱాల సాంబయ్య నవ్వుతున్న ముఖం మాసిపోయి ..... ఆశవం, ఆశవాన్ని ఏవో పీక్కుతిన్నట్టయి - మనసు తొడేస్తోంది. గొంతు ఆర్చుకుపోతుంటే పరుపుమీద నుంచి లేచి, కడవలోని నీళ్ళు గ్లాసుతో గొంతులో పోసుకొని వచ్చాను. పరుపు మీద అటూఇటూ దొర్లుతున్నాను.

ఆ చీకట్లో నా కదలికల్ని అమ్మ ఎంతగా గ్రహించిందో గాని "మూర్తీ ... పడుకోరా ... పడుకో ... తెల్లవారనీ ఏదానికైనా ..." అంది.

"అమ్మా !..... మరి సాంబయ్యని అలాగవదిలేసారేం ?" అడిగాను.

'వాళ్ళవాళ్లెవరయినా వస్తారేమోనని ఆగాం, దానికి తోడు కాలే కుళ్ళిందో లేకపోతే అది మొత్తం ఒళ్ళంతా పాకిందో గాని ఆ కంపుకి ఎవరూ ముట్టడం లేదు .... అలా అని కాకులు గెద్దలకీ వదలలేం కదా? రేపేదో చేద్దామని మీనాన్న కూడా అన్నారు. నువ్వింక పడుకో ...." అమ్మ మళ్ళీ నా ఆరోగ్యం చెడిపోతుందనేమో హెచ్చరించింది.

మాటల్లోనూ, మాటల తర్వాత గూడుకట్టుకుంటున్న నిశ్శబ్దం పెద్దశబ్దం.లా భరించలేనట్టుగా వుంది. బలవంతంగా కళ్ళు మూసుకున్నాను. కళ్ళు మూసుకున్నాసరే దృశ్యం అదృశ్యం కాలేదు.

సాంబయ్య పెరటి గట్టున నిలబడి "గుఱ్ఱం కనిపించిందమ్మా ‹..." అని అడుగుతున్నట్టునిపించింది. గుఱ్ఱం ఎక్కించి ఊరంతా తిప్పుతున్నట్లనిపించింది. ఆలోచనలో ... కలలో ఏవేవో స్పష్టాస్పష్టంగా వున్నాయి. మెలుకువ వచ్చి చూస్తే గుఱ్ఱం మెడలో మువ్వలు కాదు ... కీ ఇచ్చిన వాచీ గణగణమని మోగుతోంది. తెల్లవారి పోయిందని అక్క నన్నులేపడానికి మళ్ళీ వాచీకి కీ ఇస్తుంటే అమ్మ తిడుతోంది. అక్క తన ప్రయత్నమాపి 'తమ్ముడూ' ఆప్యాయంగా పిలిచింది.

ఏం అన్నట్లుగా చూసాను.

"నువ్వొచ్చావుగా, నీ మిత్ర పరివారం దిగింది ... అదిగో అరుగుమీద"... అక్క మాట పూర్తికాకు... గౌరి, రమణ, సత్తి వచ్చినా మంచం మీద కూర్చున్నారు.

అప్పుడే నాన్న వచ్చారు. వస్తూనే "ఆ గుఱ్ఱాల సాంబయ్యకి అయినవాళ్ళెవరూ లేనట్టే! సర్వే పని మీద వెళ్ళినా, ఈ చుట్టు పక్కల ఊర్లన్నీ భోగట్టా చేసా ..." అని, 'మూర్తీ' అని నన్ను చూసి కుశల పూర్వకంగా నవ్వారు.

"అయితే మరెందుకు బుగ్గి చేసిస్తే సరి .... నాలుగిళ్ళు ఆనాలుగుకర్రలిస్తే సరి ... మగపిల్లలు నలుగురూ కూడారు ... .ఎంత సేపు ?" అమ్మ మమ్మల్ని సమాయత్తం చేసింది.

పళ్ళుదోం పుల్లలు తీసుకొని మేం నలుగురం వీధిలోకి నడిచాం. మరో నలుగురు ... ఆరుగురు ... పదిమంది .... పోగయ్యారు. అంతా ఇంటింటికీ వెళ్ళి దండడం మొదలు పెట్టాం. ఎవరికీ తోచింది వాళ్ళు ... కర్ర ... కంప ... పిడక ... భోగి పండగకి కలప కూడినట్టే వుంది. పది గంటలవేళకి రెండు బళ్ల సరుకు ! రూపాయి ... అర్ధ ... పావలా ... పదిపైసలు ... మొత్తం నూట డెబ్భై రూపాయలు ! అప్పుడు ... తవ్వడు ... సోలడు ... పావుడు ... పిడికిడు ... ముప్పందుం బియ్యం !

> *మూడేళ్ళకిందట పుట్టి, మూడు నెల్లుగా ముడిపడి, మూడు రోజుల్నుంచి నలుగుతున్న తగువు, ఆవేళ యిటో అటో తేలిపోతుంది - ఆ భావం ఆవూరి గాలిలో అలా అలా తేలుతోంది.*
>
> *సొమ్ములు మందలకు పోయేవేళ అంటే తెలియదు, పదిగంటల వేళ.*
>
> కాళీపట్నం రామారావు - యజ్ఞం

మద్యాహ్నం వేళకి ఆకలి పేగుల్ని తిరగేస్తున్నా ... శవాన్ని తీయడానికే నిర్ణయించుకున్నాం. ఛీ కొట్టినోళ్ళు, ఛీదరించినోళ్ళు నోళ్ళు వెల్లబెట్టి పుణ్యం, మోక్షం గురించి మాట్లాడుతూ వున్నారు. తమ దానాన్ని వెలకట్టి ధర్మాన్ని చెప్పుకు తృప్తి పడుతున్నారు. అంతకు మించి శవం దగ్గరకు వచ్చేవాళ్ళు బాగా పల్చబడ్డారు. శవాన్ని ఎత్తటానికి ఇద్దరమే మిగిలాం. నేనూ, గౌరి ! ఇంతవరకూ మాతో వున్న సత్తే, రమణ ముక్కులు మూసుకుంటూ దూరంగా నిలబడ్డారు.

నాన్నేమో కొత్త పంచె తెచ్చి శవం నిండారా కప్పినట్టుగ చుట్టారు. ఊదొత్తుల కట్ట మొత్తం వెలిగించారు. కొబ్బరి కాయ, అరటి పళ్లు పక్కన పెట్టారు. వెదురు కర్రలకు అడ్డుగ వెదురు చువ్వలు వేసి తాళ్ళతో కట్టారు. పాడె సిద్ధం అయింది. పాడిమీదకు ఎత్తటం కష్టమయిపోయింది. శవాన్ని దొర్లించాం పాడి మీదకి, మేళం లేదు. శవస్నానం లేదు .. ఏడుపుల్లేవు. ఘోషల్లేవు.

నాన్నమాట సత్తిరమణ వినకపోయినా రిక్షానారిగాడు, దాలిగాడు చెరో భుజం కాస్తామని ముందుకు వచ్చారు. శవం పాడెతో లేవబోయింది. శవాన్ని భుజాల మీదికి ఎత్తుతుండగ "ఆగండి ... ఆగండి..." అంటూ ఓ బక్కపలుచటి మనిషి పక్కటెముకలు అదురుతుండగ పరుగు పరుగున వచ్చాడు. బోరున శవం మీద పడి ఏడ్చాడు. "బావ సాంబా .. ఎంత అన్యాయం సేసినావురో‹..."

ఏడుస్తూనే శవాన్ని కుదిపేసాడు. శవం తలమీద తలను పెట్టి కొట్టుకున్నాడు. కొద్ది సేపు తరువాత ఎవరో వచ్చి అతగాడ్ని లేవనెత్తారు. ఓదార్చారు.

శవం కదిలింది. అతగాడూ భుజం కాసాడు. నేను రెండో వేపు దాలిగాడు. నారిగాడు వెనుక వేపు. గౌరి కుండతో అగ్గివుట్టిలో పెట్టిపట్టుకున్నాడు. సత్తి, రమణతో పాటు మరికొంత మంది కుర్రాళ్ళు వెనుక నడుస్తున్నారు. వారి వెనుక గుఱ్ఱాల సాంబయ్య జట్కా కట్టెల మోపులతో నడుస్తోంది ఋణం తీర్చుకుంటున్నట్టు! మొత్తానికి అనాధశవానికి అంత్యక్రియలు జరుగుతున్నట్టు లేదు. కావలసిన మనిషికి జరిపిన శవయాత్రలానే వుంది !

శవం కాష్టం నేలమీద దించాం. జట్కాలోని కర్రా, పిడకా దించాం. దాలిగాడు. నారిగాడు క్షణాల్లో కర్రలు పుటం అంటించ డానికి పెట్టినట్టు చక్కగా పేర్చారు. పేర్పు పూర్తి కాకముందే పని ఆపేసి నాదగ్గర కొచ్చి చేతులు నులుముకున్నారు. శవం కట్టెల మీదికి ఇంకా చేరలేదు!

"ఏం కావాలిరా ?" నాన్న వాళ్ళని అడిగారు.

"మరేట్లేదండి ... కఱ్ఱలు సూత్తే వచ్చిగున్నాయిగదాని .. నాల్లీటర్లు కిరస నూనయితే జప్పున మంటెత్తురు కుంతాది ...' 'దాలిగాడు అనడంతో నేజేబులోంచి డబ్బులు తీసాను.

"నేనెల్తాను మీరు పనికానివ్వండి" నాన్న అన్నారు.

"అది కాదు బావు, మీకు తెలన్దేటి సెప్పండి .. మరిలాటి పనులకొడవట్టిన సెయ్యలేం గదా, రెండు పేకట్లుకి ...." నాన్నాడు నారిగాడు. వాళ్ళ వెనుక మరో ఇద్దరు చేరి 'రివాజు' అంటూ వంత పలికేరు.

యాభై రూపాయల నోటు తీసి ఇచ్చాను. వాళ్ళ ముఖాలు ఆనందంతో వెలిగాయి. ఒకడి వెనుక మరొకడు ఎవరికి వారే ఎక్కడి పనులక్కడ వదిలేసి పరుగులు తీసారు.

"తాగి అక్కడే సవ్వకుండ బేగిరండి ...." నాన్న కేక వారి చెవులకు ఏమాత్రం సోకినట్టులేదు.

ఎండకు చెమట లెక్కి వళ్ళు చిరమరమంటోంది. బుఱ్ఱ దురద పెడుతోంది. అంత ఎండలోనూ శవం నిశ్చింతగా వున్నట్టుంది. నిదుర పోతున్నట్టుగా వుంది.

"ఒరే మూర్తీ..." నాన్న పిలుపుతో ఏమిటన్నట్లు చూసాను.

"....అందులోనివే ఇస్తున్నావా ? ... అదేఁరా .. ఆ .. కలక్షన్లలోనివే ఖర్చుపెట్టు చిల్లర లేదనో .. చాల్లేదనో నీజేబులోవి మాత్రం పెట్టకుమీ, తిరిగిరావు" అమాట జాగ్రత్త చెపుతున్నట్టుగా లేదు హెచ్చరికలా వుంది.

నేజవాబివ్వకుండా తలాడించాను. ఆయనే అన్నారు ..

"మూర్తీ.... ఎంత ? నూటడబ్బై కలక్షను అన్నావు కదూ?! యాభై వాళ్ళకిచ్చావు. మరి.. నేను తెచ్చిన పంచె యాభైఆరు .. ఇంకా ఊదొత్తులు, పళ్ళూకాయలు వాటికి కలిపి తొంభై అయింది.. ఆ డబ్బులు ఇచ్చెయ్యమీ..

వంద కాగితం తీసిచ్చాను.

"...వందనోటా ...?! పదిలేదే.. పోని ఇవ్వు.. పది వస్తాది, చిల్లరలేదు. అయినా దేనికో దానికి ఆపదికెక్కువే ఖర్చుపెట్టుంటాను' వందనోటు నలిగిపోతూ జేబులోకి వెళ్ళి పోయింది.

అటు చూసాను. సాంబయ్యను బావా. అంటూ శవంపై పడి ఏడ్చిన మనిషి శవం దగ్గరలేడు. జట్కా దగ్గరున్నాడు. బండిని వరికిస్తున్నాడు. గుఱ్ఱాన్ని తడుముతూ అనుమానంగా అటూ ఇటూ చూస్తున్నాడు.

ఇటు చూసాను. కాకులూ గెద్దలు ఏదో కళేబరాన్ని పొడుచుకుంటూ తింటూ అప్పుడప్పుడూ గాల్లోకి లేస్తూ ఎగురుతున్నాయి. రాబందులు కూడా వచ్చి వాలాయి. అవీ సాంబయ్య శవం వేపు ఆశగా చూస్తున్నాయి.

శవం వేపు చూసాను. ఈగలు ఝు'మ్మంటూ ముక్కులోనికి, చెవిలోనికి దూరుతున్నాయి. పాదం లేని కాలి దగ్గర రసి'ని గుర్తుపట్టినట్టువున్నాయి. చీమలు కూడా బారులు కట్టడం మొదలెట్టాయి.

నారిగాడు, దాలిగాడు గుంపుతో పెద్దగా మాట్లాడుతూ వచ్చారు. చాలా ఉత్సాహంగా వున్నారు. ఇకటాలాడుతున్నారు. తూలుతూవున్నారు.

"సాల్లేదు బావు .. మరొక్కరవ్వయితే బాగున్ను ..."

వాళ్ళు సారా గురించి అన్నారో కిరసనూనె గురించి అన్నారో నాకు అర్థం కాలేదు. కిరోసిన్ మాత్రం రెండు సీసాల్లో రెండు అర్ధలీటర్లు మాత్రం పోయించి తీసుకు వచ్చారు.

శవం కట్టెల మీదకు చేరడంతోనే తగువు ప్రారంభమయింది.

'తల ఉత్తరంకే వుండాల ...." దాలిగాడు.

"తాగేసినావేటి ? ... దక్షిణంకి వుండాల .." నారిగాడు.

"తూరుపెటు ?" అడిగాడింకోడు.

అందరూ ఆకాశం కేసి చూసారు. సూర్యుడు నెత్తిమీద వుండడంతో ఎటువేపు నుంచి ఉదయించాడో వాళ్ళకి అర్థం కానట్టుగా వుంది. ఒక్కొక్కరు ఒక్కో దిక్కు చెప్పారు. దేవుడే దిక్కు అన్నట్టుగా వుంది సాంబయ్య శవం.

శవాన్ని ఎత్తేరు

"తూర్పుకి ..."

"కాదు ఉత్తరానికే తల ..."

"నువ్వుండేస్ ..దక్షిణంకి పెట్టాల.." దాలిగాడు. నారిగాడు శవాన్నివదిలేసి తన్నుకుంటున్నారు. చెఱువుకి వెళ్ళి అప్పుడే వచ్చిన నాన్న వాళ్ళని బూతులు తిట్టాడు.

నేనూ, గౌరి-శవాన్ని కట్టెల మీదకి చేర్చాం. ఏమనుకున్నారో ఏమో... దాలిగాడు, నారిగాడు ఇద్దరూ వచ్చి మళ్ళీ శవం మీద కట్టెలు పేర్చారు. పేర్చడమయ్యేక కిరోసిన్ దానిమీద పోసారు. తడిసిన కిరోసిన్ కట్టెకు అగ్గిపుల్ల ముట్టించి చితికి నిప్పంటించ బోయాను.

నాన్న పీల్లేదన్నాడు.

గౌరీయే శవానికి తలవేపు చితికి నిప్పంటించేడు. కిరోసిన్ చల్లినచోటంతా కొద్దిసేపు భగ్గున మండి - చల్లారి కాస్సేపు పొగరేగి - తరువాత చిన్న మంట మొదలయ్యింది. కమురు కంపు ముక్కు ద్వారాల్ని జలదరింపజేస్తోంది.

శవం మొలమీది మొలతాడు తెంపేసి, వంటిమీద బట్టను తీసేసి ఉమ్మజుట్టి దూరంగా విసిరేడు చాకలి.

గుఱ్ఱల సాంబయ్య ఒంటరిగా వెళ్ళిపోతున్నట్టునిపించింది. ఇంతకాలం విడవకుండా ఆయన జీవితాన్ని పెనవేసుకున్న జట్కా, గుఱ్ఱం తలంపుకి వచ్చి చూసాను. జట్కా లేదు. గుఱ్ఱమూలేదు. సాంబయ్య బావనని ఏడ్చిన బక్కపలచటి మనిషీలేడు.

"నాన్నా ! సాంబయ్య చుట్టవు మనిషేడి ?"

"అవును .. ఎక్కడవాడు ? ... చితికి వాడిచేత నిప్పు పెట్టించాల్సింది. గుర్తేలేదు. ఎవ్వరికీ గుర్తురాలేదీ గొల్లులో."

"జట్కా లేదు ... "

"సంజనకన తోలుకు పోనాడు గావాల ..."

... అంటే! ... అనుమానం ఎవ్వరినీ సరీగ నిలవ నివ్వలేదు. దాలిగాడు. నారిగాడు వాళ్ళు ఓ వేపు ; గౌరి, రమణ, సత్తి మరో వేపు ; నాన్న. ఇంకొందరు ఇంకోవేపు ..

ఊరుకాలిపోతున్నట్టు పరుగులు పెడుతున్నారు.

"లంజికొడుకు బంగారంలాంటి జట్కా, గుఱ్ఱం దొబ్బుకు పోండు..." ఒకరిద్దరు తిడుతూవున్నారు.

కాలిన కఱ్ఱలు కూలి శవం నిప్పు కణికల్లోకి జారింది. తన జట్కా, గుఱ్ఱం కోసం తనూ వెతుకులాడ్డానికి బయలుదేర బోతున్నట్టు సాంబయ్య కాలూ, చేతులూ నిటారయి - శవం నిలబడబోయింది. చాకలి కాఁవుడు వెదురకఱ్ఱతో శవం గుండెల మీద పొడిచాడు. కాలూ చేతుల్ని మంటల్లోకి అనిచాడు. జారిన కఱ్ఱల్ని మళ్ళీ చితిమీదకు విసిరాడు.

ఇప్పుడు శవం ఆకారం కూడా లేదు. బూడిద బయలుదేరుతోంది.

జనం వస్తున్నారు. జట్కా వస్తోంది. ఆ బక్కపలుచని మనిషీ వస్తున్నాడు. ఆ గుంపు దారిలోనే ఆగిపోయింది. నే పరిగెత్తుకు వెళ్ళి చూసాను. జట్కాని ఎందుకు తీసుకెళ్ళావ్ ? ఎక్కడికి తీసుకువెళ్తున్నావ్?" ప్రశ్నిస్తున్నారు. ఒకరిద్దరు అప్పుడే పిడికిళ్ళు బిగిస్తున్నారు.

"ఏటి జట్కా నడిపీద్దుమనే .. చెప్పాచెయ్యకుండ.." నాన్న నిలదీసేరు.

"అదికాదు బావూ... గుఱ్ఱంకి నీలు తాగిద్దుమనేసి సెరువు కడుపులోకి దిగినాను. దప్పిక్కి .. ఈవలకీ .. గుఱ్ఱం నాలిక తీడతుంటే సూడలేక ఎళ్ళినాను బావు .. నిజంగా బావు .. 'బక్క పలచటి మనిషి ప్రాధేయపడుతున్నట్టు చెపుతున్నాడు.

"వోస్ .... అరిచ్చంద్రుడి కతలు సెప్పకు" నారిగాడు తూలుతున్నా గట్టిగానే అన్నాడు.

కొంచెం సేపు నిశ్శబ్దం.

తరువాత ఆ మనిషి అన్నాడు.." బావూ.. ఇన్ని మాటలేనికిగాని.. ఆడునా బావమర్ది ... ఆడి బండిమీద ఒక్కమీద నాకక్కుంతాది .. అలాటిది దొంగల్ల దోపల్ల పోవాల్సిన గతేటినాకు ?

ఈ మాటలు చాలామందికి నచ్చలేదు. అందుకు చిట్లించిన వాళ్ళ ముఖాలే సాక్షి. అయినా ఎవ్వరూ వెంటనే జవాబివ్వలేకపోయారు.

కొద్దిక్షణాలు పోయాక దాలిగాడు అడిగేడు.

"నచ్చినోడు నీబావమర్ది అనడాకి సాచ్చీకమేటి ?"

"బాగడిగినావ్" అన్నాడు నారిగాడు.


ఆ మనిషి సమాధానం ఇవ్వలేక పోయేడు.

"అవున్నిజమే ... ఇన్నాళ్ళూ లేనోడివి .. ఇప్పుడు వున్నానంటే ఎలాగ మరి ?" నాన్న అన్నారు. నాన్న మాట నాకు నచ్చలేదు. అయినా నేనేమి మాట్లాడలేదు.

ఆ మాటలు అందరి నోళ్ళూ మూయించేసాయి. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. చాకలి కాఁవుడు వచ్చాడు. బుగ్గయిపోయిందన్నాడు. అటు చూసాం. అక్కడ ఇందాకటి కఱ్ఱల పోగూ లేదు. ఏదో బూడిద కుప్పపోసినట్టుగుంది.

"బాబూ" కాఁవుడు సుంకం అడిగినంత ధైర్యంగా లేకపోయినా చేతులు నులుముకున్నాడు. ఇరవై రూపాయలు చేతిలో పెట్టాను. జేబు ఖాళీ అయింది.

ఒక్కొక్కరూ ఊరులోకి కదిలిపోతున్నారు.




"అయితే ఆ గుఱ్ఱమూ, బండీ ఏటిసేత్తారు .."

..........

"ఏటి సెయ్యడమంటేఁ.." దాలిగాడికి నోరు తిరగడం లేదు.

"ఏం చేస్తాం ? అది .. అమ్మి కార్యం చేస్తాం .. ఎలాగ బియ్యం కూడ పడ్డాయి " నాన్న చెప్పేరు. కొంతమందికిది నచ్చినట్టుగుంది తలలాడించేరు.

అప్పుడు ఆ బక్కపలచటి మనిషి అన్నాడు.

"అలాక్కానీండి బాబు ... అంతకన్న సంతోషమేటి ? ఆ సాంబడు మీ అందరి సలవ్వల్ల మీసేతిలో బుగ్గయిపోండు .. బువ్వకూడా పెడతాడంటే ... అంతకన్న నాకీగుఱ్ఱము బండీ ఎందుకు? ఆకధాకార్యమూ సూసి నానెళ్ళిపోతాను.. నానేటీ ఇవ్వలేక పోయినా వళ్ళుంది.. కష్టబడతాను.."

'పదండి పదండి' నాన్న మాటతో మేమూ కదిలాం. చెఱువులోకి దిగి మోకాళ్ళ లోతు నీటిలో తలదాక తడిచి గట్టెక్కుతున్నారు ఇంకొంతమంది. మేం ఇల్లు చేరుకున్నాం. జట్కా పెరడులోకి వచ్చింది. గుఱ్ఱం చెట్టుకు కట్టేసారు. స్నానాలయ్యేసరికి చీకటి పడింది.

అన్నం తినకుండా వుండిపోయినందుకు అమ్మ తిడుతోంది.

నాన్న కంచం దగ్గర కూర్చుండిపోయారు. నే కూర్చోబోతుంటే అమ్మ పెసర పప్పు అరటిపళ్ళు ఏవేవో కలిపిచ్చి కాష్టంల పెట్టేసి రమ్మంది. అప్పటికే చీకటిపడుతోంది.

నే బయలుదేరాను. అప్పటిదాక గుమ్మం మీద చీకటిలో కూర్చున్న బక్కపలచటి మనిషి లేచి నాతో వచ్చాడు. గౌరిగాడ్ని పిలిస్తే చిరాకు పడుతూనే కాదనలేక వచ్చాడు.

సాంబయ్యని బూడిద చేసినచోట ఆ ఫలహారం పెట్టేసి వెనుదిరిగాం. గౌరి వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయాడు. బక్క పలుచటి మనిషి

నా వెంటే వచ్చాడు. ఇల్లుచేరాం. అమ్మ పసుపు నీళ్ళిచ్చింది. ఇద్దరం కాళ్ళుకడుక్కున్నాం. నేను ఇంట్లోకి నడిచాను. ఆ మనిషి అరుగు మీద కూర్చున్నాడు. వాడికి అరుగుమీదకే భోజనం వెళ్ళింది. నేను తిని గడపలోకి వచ్చేసరికి ఆ మనిషి మూతి తుడుచుకుంటూ నేలమీదనే చేరగిలబడ్డాడు. నేమళ్ళీ ఇంట్లోకి నడిచాను. మంచం ఎక్కి నడుం వాల్చాను. శరీరం అలసినందువల్లనేమో ఆవలింతలొచ్చి కళ్ళు ఆవిర్లు కక్కుతుంటె కళ్ళు మూసుకున్నాను.

తెల్లవారి అమ్మలేపే వరకూ తెలివి రాలేదు. తెలివొచ్చి కళ్ళు తెరచి చూస్తే ఇంటి ముందు జనం. మరోసారి కళ్ళు పులుముకొని ద్వారం దాటాను. ఆసరికే పోగయిన జనం తలోదిక్కూ పరిగెడుతున్నారు. ప్రయోజనం లేదని కొందరు పెదవి విరుస్తున్నారు. అప్పుడు కాస్త అర్థమయి పెరడులోకి వెళ్ళి చూసాను. జట్కా బండి లేదు. గుఱ్ఱమూ లేదు. వీధి అరుగుమీదికొస్తే ఆ బక్కపలుచటి వ్యక్తి లేదు!

అర్థమయిన విషయమే అమ్మ చెప్తోంది. నాన్న వాడ్ని అమ్మా ఆలీ చేసి తిడుతున్నాడు. నాకెందుకో బాధనిపించింది. తిట్టే హక్కు నాన్నకు లేదనిపించింది. ఏమనాలో తెలీక "పోనీలే నాన్న .. వాడి బావే ..." నా మాటలు పెదవి దాటలేదు.

"ఇంత చేసాం.. వాడెవడో దొబ్బుకు పోవడానికా ?" నాన్న మాట నాకు పూర్తిగా అర్థం కాలేదు. అర్థమయిందేదో అసహ్యంగా తోచింది. నేను మరి మాట్లాడలేదు.

కాస్సేపటికి గౌరి వచ్చి అదేమాటన్నాడు. సత్తి రమణ వచ్చి "మొత్తం మూడువేలు నష్టం..." తమ సొమ్మే పోయినంత కష్టంగా చెపుతున్నారు.

"గుఱ్ఱం ముసలిదయిపోయిందిలే గాని ..."

"ముసలయినా.." చస్తేనే పనికొస్తాది .. చర్మం డప్పులకి .. చెప్పులకి ..."

వారి మాటలు వినలేక .. "అబ్బా.. ఆపండి .. లాభం కోసమా, మనం ఇదంతా చేసాం ?" గట్టిగానే అరచాను.

"అదికాదురా.. అసలు మనం కష్టపడడమేమిటి ? వాడు పట్టుకు పోవడమేమిటి ?' మళ్ళీ మళ్ళీ అదేమాట. ముగ్గురిదీ అదేమాట. నాన్నదీ అదేమాట. నారిగాడిదీ, దాలిగాడిదీ కూడా అదేమాట.

ఆరోజంతా ఆ బక్కపలచటి మనిషి కోసం వెతకడం .. తిరగడం .. తిట్టుకోవడంతోనే గడిచిపోయింది.

తెల్లవారింది.

సాంబయ్య పోయి అది ఐదవ రోజు ...'

ఆరోజు 'దినం'.

మావూరులోని పెళ్ళిళ్లకీ, చావులకీ, సంవత్సరాలకీ పెట్టే బంతి భోజనాలన్నీ బడిలోనే, నిలువుగ మనిషి పట్టే పొడవు వెడల్పున జోలు పొయ్యి తవ్వారు. బడిలోనే సాంబయ్య 'దినం' భోజనాలు.

పొయ్యిలోని కర్రలు వుండీ వుండీ చిటపట పేలుతున్నాయి. పొయ్యిమీది కుండలు కుతకుతలాడుతున్నాయి. గూర పులుసు 'ఘూ' మంటోంది. శెనగలు వంకాయ కూర దించేసినా ఆవిరి కక్కుతోంది. ఉడికిన అన్నం తపేలాల్ని రెండు కర్రలతో అంచులకు పట్టి అటూ ఇటూ ఇద్దరు నిలబడి గంపలో వంపుతున్నారు. గెంజి కారుతోంది. కుక్కలు మూతి పెట్టడానికి తహతహ లాడుతున్నాయి. నిన్నటి సంఘటనని తలచుకొని నారిగాడు తిడుతున్నాడు.

మధ్యాహ్నానికి భోజనాలు తయారు అయ్యాయి. తినడానికి మనుషులే లేరు. కబురు చేస్తే కూలిపేట, రిక్షా కాలనీ వాళ్ళు మాత్రం వచ్చారు. ఊర్లోని మిగతా వాళ్ళంతా వస్తామన్నారేగాని ఎవ్వరూ రాలేదు.

నాన్న వచ్చారు. అమ్మరాలేదు. అక్కని కూడా పంపలేదు.

నేనూ, గౌరి, సత్తి, రమణ అంతా తిండికి కూర్చున్నాం. నారిగాడు, దాలిగాడు అప్పటికే తినిలేచి మాకు వడ్డించారు. పకీర్రాముడు, వాడి జట్టుగాడు తిన్నదికాక తపేలాల్తో అన్నం, కూర, చారు మోసుకు వెళ్ళారు.

మా భోజనాలయ్యాక మిగిలిపోయిన పదార్థాలు చూసి ఊర్లోకి మరోదపా వెళ్ళి చెప్పాం. ఊరిచివర దిగిన దుమ్మరోళ్ళు. ఇంకా అడుక్కునే వాళ్ళను పిలిచాం. వచ్చిన వాళ్ళందరికి తృప్తిగా భోజనం పెట్టాం. తెచ్చుకున్న చిన్న చిన్న తపేలాలు నింపాం.

మధ్యాహ్నం రెండు దాటుతుండగ చిన్న పిల్లలు భోజనాలకు వచ్చారు. ఒకర్ని చూసి ఇంకొకరు కదిలారు. పిల్లల్ని తెస్తూ పెద్దవాళ్ళూ .. వాళ్ళని చూస్తూ వీళ్ళు ... అని వాళ్ళూ ... వంట ఘుమ ఘుమలకి కూర్చున్నారు. 'కులమూ గోత్రమూ లేని వాడి చావు విందుకా' అన్న నోళ్ళు చాటుగ తపేలాల్ని వంపుతున్నాయి. అందరూ కదిలేక ఆ విషయమూ లేదు, అన్నమూ లేదు.

భోజనాలు ఆలస్యమయినా బాగా జరిగాయని తృప్తి పడుతూ క్షణం కాలేదు, నాన్న అరుస్తూ వచ్చాడు. నా చెయ్యి పట్టుకు

*"ప్రతిమనిషికి సంఘంలో బాధ్యతలతో పాటు సొంత జీవితం కూడా కొంత వుంటుంది. ఈ రెంటికీ సంబంధించిన పనులు ఏకకాలంలో తగుల్తాయి. ఏదిముందు, ఏది వెలుకన్నది తేల్చడం కష్టమైపోతుంది.*

*ఇలాంటి సంఘర్షణల్లో - అంటే లడాయిల్లో - దేనికి ప్రాధాన్యత యివ్వడమనేది మన పూర్వులు ఏనాడో తేల్చేశారు. 'ప్రజాభి మానమా! సీతాదేవా! ఎవరు నీకు ముఖ్యం"?*

*అంటే ఆ శ్రీరామచంద్రుడు తడువుకోకుండా జవాబిచ్చేడు కాని యీ శ్రీ రాములు నాయుడు శుద్ధ మానవ మాత్రుడు అతన్ని మీరు క్షమించాలి.*

కాళీపట్నం రామారావు - యజ్ఞం

లొక్కెలుతుంటె అర్థం కాక అడిగాను.

"అంతా మనదనుకున్నాం. కాని లోకం అలాలేదు.. మనం గుజ్జాల సాంబయ్య సొమ్ముతిన్నామట.. కావాలనే వాడి బావమర్దికి గుజ్జమిచ్చి రాత్రికి రాత్రికి తోలుకు పొమ్మన్నామట. అందుకని వాడి దగ్గర డబ్బులు మింగేమట.. ఇంకెందుకురా చేసి ? పద పద .." నాన్న పళ్ళు తిని గింజలూస్తున్నట్టు గున్నారు.

"...అదికాదు నాన్నా ? ఒకరంటారనో .. మరొకరి మెప్పుకోసమో.. " నామాట నా నోటిలోనే వుంది .. "నువ్వు నోర్మూయ్యి నీకు లోకం తెలీదు .." నాన్న మాట నాన్నదే. అమ్మగొంతెత్తి వీధిలో నిలబడి తిడుతోంది. అక్క అమ్మని ఇంటిలోకి తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తోంది.

నేను అచేతనంగా వెళ్ళి అరుగు మీద కూర్చున్నాను. ఎవ్వరినీ వారించలేదు. జరిగిన విషయాలన్నీ తలచుకున్న కొద్దీ నాకు అసహ్యంగానే వుంది. 'ప్రయోజనం' లేని పని అనవసరంగా తలమీద వేసుకున్నావనీ అనిపించింది.

సాయంత్రానికల్లా గౌరి, సత్తి, రమణ వచ్చారు. అమ్మతోనూ నాన్నతోనూ ఏదో మాట్లాడి వెళ్ళారు.

చీకటి పడ్డాక మళ్ళీ వచ్చారు. సంచితో ఏదో తెచ్చినట్టుగున్నారు. ఇటూ అటూ తిరుగుతున్నారు. నాన్న ఉషారుగానే తిరుగుతున్నాడు. అమ్మమామూలుగానే వున్నట్లుంది.

నేను ఇంట్లోకి నడిచాను. అక్క పప్పు రుబ్బడం పూర్తి చేసి గారెలకు పెనం వేసింది. అమ్మ ఒక కోడి కోస్తుంటే, మరో కోడికి సత్తిగాడు ఈకలు పీకుతున్నాడు. ఇంట్లో వాతావరణం ఏదో పండగ రోజులా కనిపించింది. గౌరి, రమణ అమ్మ వంటను పొగుడుతూ మెచ్చుకుంటున్నారు. దాలిగాడు, నారిగాడు వీధి అరుగు మీద కాసుకు కూర్చున్నారు. నాన్న ఈల వేస్తూ వచ్చి పొయ్యి దగ్గర కూర్చొని ఎప్పుడూ లేనిది వంట సాయం చేస్తున్నారు.

ఇదంతా చూస్తూ వుంటే గతంలో జరిగిన కొన్ని రోజులు జ్ఞాపకం వచ్చాయి. దసరాకి, పండగకి... వీధిలో విగ్రహాలు పెట్టి పూజలు జరిపి అనిపేసిన తర్వాత కూడా ఇలానే 'సరదాలు' 'సంబరాలు' గడిచేవి. ఇప్పుడెందుకో ? నాకు తట్టలేదు. అడిగితే అమ్మా చెప్పలేదు. మిగతా వారిని అడిగి ప్రయోజనం లేదు.

వీధి గుమ్మం మీద మళ్ళీ కూర్చున్నాను. పక్కకు చేరిన దాలిగాడు, నారిగాడు ఆనందం పట్టలేక పోటీపడి విజయరహస్యం గాలితోవూదారు, గొంతేలేనట్లు !

గుజ్జాల సాంబయ్య గుజ్జాన్నీ, జట్కానీ తోలుకుపోయిన ఆ బక్కపలచటి మనిషి పాలకొండలో పట్టుబడి పోయాడట. తనని వదిలెయ్యమని కడుపుమీద కొట్టొద్దని గగ్గోలు పెట్టేశాట. పోనిలే కదా అని రెండొందల రూపాయలు తీసుకొని వదిలేసారాట. ఇంత కష్టపడినందుకు .. ఏదో సరదాగ మంచి కూర .. కాస్త మందు .. అంతేనట !

కోడిమాంసం మసాలాలో మగ్గి ఘుమ ఘుమలాడివాసన ముక్కు పుటాల్ని జలద రింపజేస్తోంది. ఇంట్లోకి పిలచి అమ్మ కంచంలో గారెలు, మాంసం వేడివేడిగా వడ్డించింది.

"నేను తినను .. నాకిష్టం లేదు ...."

"నువ్వు తినక పోతే నామీదొట్టు.. నన్ను చంపుకు తిన్నట్టు .. ఆఁ .. అంతే!.." అమ్మా ఏమీ ముట్టలేదు. నేకాస్త తగ్గాను. నాలిక మీద నీరు వూరుతోంది. నే కంచంలోని ముక్కని పళ్ళతో కొరికాను. అమ్మతో పాటు అక్కా సంతోషించింది.

నారిగాడు, దాలిగాడు ముంతలోని కల్లు గొంతులో పోసుకొని కూరతింటూ వేళ్ళు చప్పరిస్తున్నారు. పిల్లలెదుట తాక్కూడదనేమో, నాన్న దేవుడు గదిలో మందు సీసా ఖాళీ చేస్తున్నారు. నేను కూడా ....

పళ్ళకింద పడిన దుమ్ము కలుక్కు మంది. సాంబయ్య శవం మళ్ళీ మెదిలింది... అదే కుళ్ళు కంపుతో .. కుక్కలు కొరకడం లేదు .. పీకులాడడం లేదు.. వాటికి దొరకాల్సిందేదో మా పళ్ళ మధ్య నలుగుతోంది.. వాంతొచ్చినట్లయి కక్కడానికి లేచాను.

(బాల్జీ'కి కృతజ్ఞతల్తో !)

## కేతు విశ్వనాథరెడ్డి కథలకు "ఋతుంభర" పురస్కారం



భారతీయ భాషా పరిషత్, కలకత్తా వారు విశాలాంధ్ర ప్రచురణాయలం ప్రచురించిన "కేతు విశ్వనాథరెడ్డి కథలు" - అన్న సంకలనానికి 1994 ఋతుంభర పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి సంవత్సరం భారతీయ భాషల్లో వివిధ ప్రక్రియల్లో వచ్చిన ఉత్తమ గ్రంథాలకు వివిధ పురస్కారా లందించటం ఈ పరిషత్ కార్యక్రమల్లో ఒకటి. గతంలో ఈ పురస్కారా లందుకొన్న తెలుగు సాహితీ వేత్తలు డా॥ సి. నారాయణరెడ్డి (1982), డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు (1986), శ్రీమతి మాలతీచందూర్ (1990), డా॥ రావూరి భరద్వాజ (1993), ఈ సంవత్సరం 1994కి గాను డా॥ కేతువిశ్వనాథరెడ్డి గారిని ఎన్నుకొన్నారు. తెలుగు పల్లె ప్రజల జీవితాన్ని చిత్రించటంలో డా॥ కేతువిశ్వనాథరెడ్డి ప్రసిద్ధులు. ముఖ్యంగా రాయలసీమ వాతావరణం, కష్టాలు సుఖాలకు వాస్తవ ప్రతిబింబాలు ఈ కథలు.

1996 ఫిబ్రవరి 11వ తేదీన విజ్ఞాన భవన్ న్యూఢిల్లీలో జరిగే పురస్కార మహోత్సవంలో భారత రాష్ట్రపతి డా॥ శంకర్‌దయాళ్ శర్మ వివిధ భాషల్లో ఈ పరిషత్ వారు ఎన్నుకొన్న ఉత్తమ గ్రంథ రచయితలకు బహుమతి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రచయితకు రు. 15,000/- లు, ప్రశంసా పత్రం, జ్ఞాపికను బహూకరిస్తారు.